పేదల గృహ నిర్మాణాలపై నీలినీడలు

- సొంతింటి కల సాకారానికి గత ప్రభుత్వం చర్యలు
- నెల్లూరుపాళెం, పమిడిపాడులో వైఎస్సార్‌జగనన్న కాలనీల ఏర్పాటు
- అందులో 1570 మందికి ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు
- శ్లాబు దశలో 750కుపైగా గృహాలు
- కొత్త ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని హౌసింగ్ అధికారులు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



నెల్లూరుపాళెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో చివరి దశలో గృహ నిర్మాణాలు



పమిడిపాడులోని వైఎస్సార్ జగనన్న కాలనీలో లెంటిల్ స్థాయిలో నిర్మాణాలు

ఆత్మకూరు: పట్టణంలోని పేదల సొంతింటి కలను సాకారం చేయాలని భావించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెల్లూరుపాళెం, పమిడిపాడు వద్ద వైఎస్సార్‌సీపీ జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. అందులో పార్టీలకతీతంగా అర్హులైన 1570 మంది పేదలకు 9 అంకణాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించడంతో పాటు గృహాలను సైతం మంజూరు చేసింది. రెండు లేఅవుట్లలో సుమారు 750కుపైగా గృహాలు శ్లాబు స్థాయికి చేరుకుని ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇళ్ల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త గృహ నిర్మాణాలకు సంబంధించి రూ.4లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించినా పాత ఇళ్ల పెండింగ్ బిల్లులకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

గ్రూప్‌గా గృహ నిర్మాణాలు

గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకే ఆప్షన్లు ఇచ్చింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని పలువురు లబ్ధిదారులు కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగాయి. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని రెండు లేఅవుట్లలో సుమారు 750 గృహాలు శ్లాబు లెవల్‌కు చేరుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయి. ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల మంజూరులో జాప్యం జరగడంతో పనులు నిలిచిపోయాయి. .

బిల్లుల కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం బిల్లుల మంజూరుకు సంబంధించి గృహ నిర్మాణ శాఖకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. కొత్త ఇళ్ల నిర్మాణాలకు రూ.4లక్షలు అందజేయనున్నట్లు ప్రకటించినా పాత ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సొంత డబ్బులు ఖర్చు చేసి ఇళ్ల నిర్మాణ పనులు చేసుకున్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో వడ్డీలు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యుత్ కష్టాలు

కొందరు లబ్ధిదారులు కొత్త ప్రభుత్వ నిర్ణయంతో సంబంధం లేకుండా సొంత నగదు ఉపయోగించుకుని మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసుకున్నారు. అయితే గృహాలకు విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించగా గతంలో నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్మాణాలు నిలిపివేసిన పలువురు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కొత్త విద్యుత్ మీటర్ల ఏర్పాటును నిలిపివేసినట్లు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ఏమిటో....?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తారని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం నిర్మాణ పనులు ప్రారంభించాలని పలువురు లబ్ధిదారులు ఎదురుచూశారు. ఇటీవల ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన గృహ నిర్మాణ సమీక్షలో పీఎంఏవై-2 కింద కొత్త గృహ లబ్ధిదారులకు రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేసేలా నిర్ణయం తీసుకున్నారు. అయితే పీఎంఏవై-1 గృహాలకు సంబంధించిన బిల్లులపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమైన గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించగా ప్రభుత్వం కొత్త ఇళ్ల నిర్మాణాలకు రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ఇళ్ల నిర్మాణ పనులు, పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ఆదేశాలు అందలేదని తెలిపారు.

క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కలిగిరి: కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాళెం తిప్ప వద్ద అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కలిగిరిలో అయ్యప్ప మాలధారణ చేస్తున్న భక్తులు ఐక్యంగా ఆలయ నిర్మాణానికి పూనుకుని భక్తిశ్రద్ధలతో భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు.

గంగమ్మకు వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటాన్ని బహూకరిస్తున్న దాతలు

సోమశిల: అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్లలో కొలువైన గంగమ్మకు గ్రామానికి చెందిన రాచాల వెంకటరమణ, అంజలి దంపతులు వెండి కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. కుటుంబ సమస్యలతో అమ్మవారికి మొక్కుకున్నామని, అవి తీరడంతో రూ.60వేల విలువైన వెండి కిరీటాన్ని బహూకరించినట్లు దాతలు తెలిపారు. ఆలయ అర్చకులు వెండి కిరీటాన్ని గంగమ్మకు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని రాచవారిపల్లి, జంగాలపల్లి, తురకపల్లి, భైరవరం, తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ఉచితంగా అందజేశారు. దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు నరసింహులు, రవణమ్మ, వెంకటసుబ్బమ్మ, అక్షయ, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చింతలపల్లి శివైక్యం



లక్ష్మీనరసయ్య (ఫైల్)

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన పురోహితుడు చింతలపల్లి లక్ష్మీనరసయ్య తన నివాసంలో ఆదివారం ఉదయం స్వర్గస్తులయ్యారు. వారి అంతిమ సంస్కారాలను డీసీపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు చింతలపల్లి మధుసూదన్‌శర్మ తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



చేజర్ల: బీజేపీ దళిత మోర్చా రాష్ట్రాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానంద్, శ్రీనివాసను చేజర్ల మండల దళిత నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన దళిత మోర్చా కోస్టల్ ఆంధ్ర సమావేశానికి హాజరైన వారిని శాలువాలతో సత్కరించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కామంచి భద్రయ్య, దళిత మోర్చా మండలాధ్యక్షుడు యల్లంటి శ్రీనివాసులు, నాయకులు కోటేశ్వరరావు, కొమ్మల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

15న ఉచితంగా వైద్య పరీక్షలు

ఆత్మకూరు: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న పట్టణంలోని ఎల్‌ఆర్ పల్లిలో ఉన్న అపోలో క్లీనికల్ ల్యాబ్‌లో సైనికులు, విశ్రాంత సైనికులకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ సంధాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, గుండె, కిడ్నీ, మూత్ర, రక్త (సీబీసీ), తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సైనికులు, విశ్రాంత సైనికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): పట్టణంలోని యర్రబల్లిపాళెంలో పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది. నాలుగురోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా తొలిరోజు అంకురార్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు పెట్టి పూజలు నిర్వహించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



జలదంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జలదంకి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జలదంకిలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సాగించిన పోరాటంలో ఎందరో అమరులయ్యారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత జాతీయభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. యువతలో జాతీయతను పెంపొందించే లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి మీద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. బీజేపీ మండల కన్వీనర్ శరత్‌కుమార్, కిసాన్‌మోర్చా నాయకుడు చల్లా హనుమారెడ్డి, నాయకులు వంటేరు రాకేష్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి: పట్టణంలో ఓ అద్దె దుకాణం విషయంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న ఘర్షణకు సంబంధించి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న సంధాని అనే వ్యక్తికి చెందిన దుకాణాన్ని షేక్ గాజుల అబ్దుల్‌నబి సోదరుడు అరాఫత్ అద్దెకు తీసుకుని మూడేళ్లుగా నడుపుతున్నాడు. ఇటీవల అరాఫత్ తన భార్యకు ఉద్యోగం రావడంతో దుకాణాన్ని రెగ్యులర్‌గా కాకుండా అప్పుడప్పుడు తీస్తున్నాడు. ఈ క్రమంలో అబీద్ అనే వ్యక్తి అరాఫత్ నిర్వహిస్తున్న దుకాణాన్ని తనకు అద్దెకు ఇవ్వాలని దుకాణ యజమాని సంధానిని కోరగా, అతను ఖాళీ చేసిన తర్వాతే దుకాణం ఇస్తానని తెలిపాడు. ఈ విషయమై అబీద్, అరాఫత్ సోదరుడు అబ్దుల్‌నబి మధ్య శనివారం రాత్రి వివాదం జరిగింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం అబీద్ బంధువులైన జాఫర్‌మొహిద్దీన్, అంజాద్‌లు అబ్దుల్‌నబి ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగారు. ఈ విషయమై అబ్దుల్‌నబి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి అబీద్, జాఫర్‌మొహిద్దీన్, అంజాద్‌తో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదభరితంగా వంతెన



ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ–డీసీపల్లి రోడ్డులో సోమశిల ఉత్తర కాలువపై ఉన్న వంతెన ప్రమాదభరితంగా ఉంది. ఈ మార్గంలో సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉండడంతో వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుమారు రూ.10 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టారు. అయితే కల్వర్టు తమ పరిధిలోనిది కాదని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వదిలేశారు. రెండేళ్ల క్రితం సుమారు రూ.600 కోట్లతో ఉత్తర కాలువ విస్తరణ పనులు చేపట్టారు. ఆ సమయంలోనూ సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్ అధికారులు వంతెనను పట్టించుకోలేదు. ఈ ప్రాంతంలో ఉత్తర కాలువ సుమారు 30 అడుగుల లోతు ఉంటుంది. వంతెన ప్రమాదభరితంగా ఉండడంతో దానిపై ప్రయాణం వాహనదారులకు దినదినగండం నూరేళ్ల ఆయుష్షుగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వంతెన సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రజారోగ్యంపై సదస్సులు

అల్లూరు: మండలంలోని పంచాయతీల్లో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ప్రజారోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం తెలిపారు. 12న బీరంగుంట, నార్త్‌ఆములూరు, బట్రకాగొల్లు, 13న ఇందుపూరు, పురిణి, ఈస్ట్ గోగులపల్లి, 14న వెస్ట్ గోగులపల్లి, గ్రద్దగుంట, వెలిచర్ల, 16న ఇస్కపల్లి పంచాయతీల్లో సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు.

సుబ్బరాయుడుస్వామికి విశేష పూజలు

వరికుంటపాడు: మండలంలోని పాములపల్లెలో ఉన్న సుబ్బరాయుడుస్వామి ఆలయంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారు విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మకు పొంగళ్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో నాగార్పమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రితో మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మూణ్ణాళ్ల ముచ్చట



మర్రిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే ఉద్దేశంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్లకు సంబంధించిన స్తంభాలు మూణ్ణాళ్లకే ఒరిగిపోతున్నాయి. ఇటీవల డీసీపల్లి వద్ద ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ స్తంభాల్లో ఒకటి పక్కకు ఒరిగిపోగా మరికొటి నేలకొరిగింది. విద్యుత్ లైన్‌ను పూర్తిస్థాయిలో నిర్మించక ముందే స్తంభాల పరిస్థితి ఇలా ఉంటే భవిష్యత్తులో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలను పటిష్టంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ

వరికుంటపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం నుంచి బుధవారం వరకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, అభివృద్ధి ప్రణాళికల తయారీ, నిధుల వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో జరిగే శిక్షణకు పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని అశోక్‌నగర్ ఫీడర్‌లో లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఖుద్దూస్‌బాషా ఆదివారం తెలిపారు. భోగ్యంవారిపల్లె, వేంపాడు, వెంగమాంబపురం, అశోక్‌నగర్ గ్రామాల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సీతారామలక్ష్మణఆంజనేయస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సంగం: శిఖర కలశానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అనుమసముద్రంపేట: మండలంలోని తెల్లపాడులో నూతనంగా నిర్మించిన రామమందిరంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత మూడ్రోజులుగా వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు కావలికి చెందిన నరసింహశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు యద్దనపూడి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నూతన విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖరంపై కుంభాభిషేకం చేశారు. గ్రామస్తులు, వారి బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.

వేడుకగా కుంభాభిషేక మహోత్సవం

సంగం: మండలం అన్నారెడ్డిపాళెంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేకం నిర్వహించి పవిత్ర జలాన్ని భక్తులపై చల్లారు.

వేధిస్తున్న మౌలిక వసతుల కొరత

శరవేగంగా విస్తరిస్తున్న పట్టణం

- అందుకనుగుణంగా మెరుగుపడని సౌకర్యాలు
- అధ్వానంగా పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



డ్రైనేజీ సౌకర్యం లేక రోడ్డుపై నిలిచిన నీరు(ఫైల్)

వింజమూరు(ఉదయగిరి): మండల కేంద్రమైన వింజమూరు శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణంలో విద్యా, వైద్యపరంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు ఉండడంతో నిత్యం పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు, రోగులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది తమ పిల్లల చదువు, ఉపాధి నిమిత్తం పట్టణానికి వలస వస్తున్నారు. దీంతో పట్టణ జనాభా శరవేగంగా పెరుగుతోంది. అందుకనుగుణంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, తదితర మౌలిక వసతులు మెరుగుపడడం లేదు. వింజమూరు మేజర్ పంచాయతీగా ఉంది. ఏడాదికి రూ.కోటికిపైగా ఆదాయం సమకూరుతోంది. అయినా పంచాయతీ పాలకులు వసతుల కల్పనకు చొరవచూపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పదేళ్లలో భారీగా పెరిగిన జనాభా

పట్టణ జనాభా పదేళ్ల క్రితం కేవలం 20వేలలోపు మాత్రమే ఉండేది. ప్రస్తుతం దాదాపు 35వేల వరకు ఉండొచ్చని అంచనా. దీనిని బట్టి చూస్తే ఎంత త్వరగా జనాభా సంఖ్య పెరుగుతుందో అర్థమవుతోంది. ఈ పెరుగుదలకు కారణం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తున్న వలస కుటుంబాలే. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం, ఉపాధి అవకాశాలు, పిల్లలు చదువుల కోసం అనేక మంది వలస వస్తున్నారు. దీంతో పట్టణ జనాభా అధికంగా పెరుగుతోంది.

మెరుగుపడని మౌలిక వసతులు

పదేళ్ల వ్యవధిలో పంచాయతీ బస్టాండ్ వరకు మాత్రమే ఉన్న వింజమూరు నేడు చాలా వేగంగా విస్తరిస్తూ బంగ్లా సెంటర్ వరకు పెరిగిపోయింది. ముఖ్యంగా టీచర్స్ కాలనీ, హిందూనగర్, వెంగమాంబనగర్, గంగమిట్ట, నేతాజీ కళాశాల ఏరియా, బీసీ కాలనీ, తదితర ప్రాంతాలు నూతనంగా అభివృద్ధి చెందాయి. ఈ పదేళ్లలో సుమారు 15వేల వరకు జనాభా పెరిగింది. నాలుగువేల కుటుంబాలు కొత్తగా ఏర్పడ్డాయి. అయితే అందుకనుగుణంగా కొత్తగా ఏర్పడిన ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు సజావుగా వెళ్లడం లేదు. మరోవైపు సీసీరోడ్లు నిర్మించని కారణంగా చిన్నపాటి వర్షం పడినా వీధులు బురదమయంగా మారుతూ రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది కొరతతో ఇంటింటి చెత్త సేకరణ జరగక వీధుల్లో చెత్త పేరుకుపోయి పారిశుధ్యం లోపిస్తోంది. కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో బోర్ల ద్వారా డైరెక్ట్ పంపింగ్ విధానంలో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ కారణంగా కొన్ని ప్రాంతాలకు సక్రమంగా సరఫరా కాక తాగునీటి సమస్య నెలకొంటోంది. పట్టణ ప్రాంతంలో లేఅవుట్లు వేస్తున్న వ్యాపారులు తగిన మౌలిక వసతులు కల్పించకుండా ప్లాట్లు విక్రయిస్తున్నారు. అక్కడ నిర్మిస్తున్న ఇళ్లకు సరైన వసతులు ఉండటం లేదు. హిందూనగర్, వెంగమాంబనగర్, గంగమిట్ట, బస్టాండ్ సెంటర్, బంగ్లా సెంటర్, తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు సైతం ఆక్రమణకు గురి కావడంతో సమస్య మరింత జటిలంగా మారింది. త్వరలో మున్సిపాలిటీగా అవిర్భావించే అవకాశం ఉన్న వింజమూరు అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వింజమూరు సమాచారం

పట్టణ జనాభా	- 35వేలు
కుటుంబాల సంఖ్య	- 8వేలు
పంచాయతీ సిబ్బంది	- 50 మంది
పంచాయతీ ఆదాయం	- రూ. కోటి
ఆర్థిక సంఘం నిధులు	-రూ. 80లక్షలు
పన్ను బకాయిలు	- రూ.55 లక్షలు

రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. తాగునీరు సరఫరా చేస్తున్నాం. కొత్తగా సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

–శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి